


## జరిగిన జగన్నాటకం

సవ్యలంకలో కుడి చేతిని వాడి, మరణదండన నుంచి తప్పించుకున్నాడు బోసు. భవిష్యజ్ఞాన గ్రంథంలో చెప్పబడిన మహాబసు బోసేనని అతణ్ణి నాయకుణ్ణి చేశారు. వామదేవుడు సత్యోద్యమకారులను హతమార్చడంతో శాంతిపోరాటం సాయుధపోరాటంగా మారింది. వామదేవుడి గూఢచారి ఉదంతుడు పోరాటంలో చేరాడు. మహాబసుగా తన అనుభవాలన్నింటినీ డా. నరసింహంకి చెప్పాడు సారథి. దక్షిణావతం వెళ్ళాలా లేదా అన్న విషయమై సైన్యం రెండు భాగాలుగా విడిపోయింది. పేరలల్ వరల్డ్స్ లో ప్రయాణం వల్ల సారథి సవ్యలంకకి వెళ్ళాడని డా. నరసింహం చెప్పాడు. వర్తకసభలో వర్తకులు తమ వ్యాపారాలపైన ఉద్యమ ప్రభావం గురించి చర్చించారు. సిరిగిరితో ఏకాంతంగా ఆ చర్చని కొనసాగిస్తున్నాడు మహాబసు.

# –18 –

**“మహాబసూ,** వ్యాపారం ప్రభుత్వం – ఈ రెండూ ఒకదానితో ఒకటి పెనవేసుకోని వున్నాయి. ఒకటి డబ్బు మరొకటి అధికారం. ప్రభుత్వాలు అధికారంలోకి రావడానికి, అక్కడే వుండటానికి, అధికారాన్ని చెలాయించడానికి ఎంతో డబ్బుని ఖర్చు పెట్టాల్సివుంటుంది. ఆ డబ్బు మొత్తం సమకూర్చేది వ్యాపార సంస్థలే. అలా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఆయా వ్యాపార సంస్థలకు లాభాలు వచ్చేలా పథకాలను, వ్యాపార నియమాలను రూపొందిస్తుంటుంది. ఇది ఈ రెండింటి మధ్య వుండే సంబంధం.” చెప్పాడు సిరిగిరి.

“అక్రమ సంబంధం” నవ్వాడు మహాబసు. సిరిగిరి చెప్తున్నది తెలిసిన విషయమే అయినా ఆయన ఇంకా ఏదో కొత్త విషయాన్ని చెప్పబోతున్నాడని అతను నమ్ముతున్నాడు. అందుకే శ్రద్ధగా వింటున్నాడు.

“మీలాంటి విప్లవకారులకి అది అక్రమ సంబంధం లాగా కనిపిస్తుంది కానీ అది ఒక అనివార్యమైన సంబంధం అని గుర్తించాలి”

“అనివార్యమెలా అవుతుంది సిరిగిరిగారూ. ఏం? డబ్బు ఖర్చు చెయ్యకుండా ప్రభుత్వాలు ఏర్పాటు కాలేవా? మనుగడ సాగించలేవా? వ్యాపారస్థుల నుంచి ఎప్పుడైతే డబ్బు తీసుకోవడం జరుగుతుందో ఆ క్షణమే ఆ ప్రభుత్వం ఆయా వ్యాపారస్థుల పట్ల లేదా వ్యాపారాల పట్ల ఆనుకూల్యత ప్రదర్శించాల్సి వస్తుంది. వాళ్ళకి నచ్చేలా పథకాలను, విధానాలనూ రూపొందించాల్సి వస్తుంది. చెత్త బుట్టలు తయారు చేసే సంస్థ ప్రభుత్వానికి ఆర్థికంగా సహాయపడితే, ప్రభుత్వం స్వచ్ఛత శుభ్రత అంటూ పథకాలను, నియమావళిని రూపొందిస్తుంది. శుభ్రత ప్రజలకు కూడా మంచిదే కాబట్టి ఇది తప్పులా కనిపించకపోవచ్చు. ప్రాణాంతకమైన మరో ఉత్పాదనలు తయారు చేసే సంస్థ కూడా ఇలాగే ప్రభుత్వానికి ఆర్థిక సాయం చేస్తే, ప్రభుత్వం కూడా ఆ సంస్థకు చేయూతనిస్తే అప్పుడు జరిగే పర్యవసానానికి ఎవరు బాధ్యులు?” ఆవేశంగా చెప్పి ఆగిపోయాడు మహాబసు. సిరిగిరి అతని వైపే ఆరాధనగా చూస్తున్నాడు.

“మీ ఆవేశాన్ని అర్థం చేసుకోగలను. కానీ అది అనివార్యమైనదని మొదటే చెప్పాను. ఎప్పుడూ ప్రజాశ్రేయస్సునే కోరుకునే ప్రభుత్వం పాలిస్తున్నప్పుడు అలాంటి సంస్థల సహాయాన్ని నిరాకరిస్తుంది. ఆ విజ్ఞత పాలకులలో వున్నంతకాలం అలాంటి ప్రమాదమేమీ వుండదు.” చెప్పి మంచి నీళ్ళు అందుకోని ఒక్క గుటక తాగాడు.

మహాబసు నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. పైగా అపనమ్మకం స్పష్టంగా కనిపిస్తోంది. ఆయన చిన్నగా నవ్వాడు.

“అందుకే మీతో మాట్లాడాలనుకున్నాను. మీరు ఇప్పుడు పోరాటంలో వున్నారు. ఒకటి మంచి, మరో చెడు వున్నాయననీ, మీరు మంచి వైపు నిలబడి యుద్ధం చేస్తున్నారని అనుకుంటారు. అది నిజంగానే మంచో కాదో పక్కన పెడదాం. మంచి చెడుల గురించి అనుకుందాం. ప్రపంచంలో ఏదీ స్పష్టమైన మంచి కానీ, స్పష్టమైన చెడు కానీ వుండదు. కానీ పోరాటం చేస్తున్నవాళ్ళు పూర్తి మంచి వైపు వుండి, పూర్తి చెడుతో పోరాడుతున్నామని అనుకోవాలి. అలా అనుకోకపోతే పోరాటం సాగదు.” మళ్ళీ చెప్పడం ఆపి కొనసాగించాడతను.

“ఇదంతా ఎందుకు చెప్పానా అని ఆశ్చర్యపోతున్నావేమో. వ్యాపారం అంటే చెడ్డది అని నువ్వు మనస్ఫూర్తిగా నమ్మితే నేను చెప్పేది వినతగ్గదిగా కూడా నీకు అనిపించదు. మంచి చెడు పోత పోసినట్లు విడివిడిగా వుండవు మహాబసు. మీకు ఇంకా వివరంగా చెప్తాను వినండి. ఇది కొన్ని శతాబ్దాల క్రితం చరిత్ర. సవ్యలంక చరిత్ర” అంటూ చెప్పసాగాడు.

"నిజానికి సవ్యలంకలో వున్న మనుషులంతా ఇక్కడి వాళ్ళే కాదు. కొన్ని వందల సంవత్సరాల క్రితం ఇక్కడికి వచ్చి స్థిరపడినవాళ్ళు సుమారు మూడొంతులు వుంటారు. అయితే ఎన్నో ఏళ్ళుగా మిగిలిన ప్రపంచానికి సంబంధం లేకుండా ఒక ద్వీపంలా సవ్యలంక వుండిపోవడం వల్ల వాళ్ళంతా ఇక్కడే స్థిరపడిపోయారు. ఇప్పుడు ఎవరు సవ్యలంక స్థానికులో ఎవరు స్థానికులు కాదో కూడా తెలియనంతగా కలిసిపోయారు. అందుకు సజీవమైన ఉదాహరణ నేనే. మా ముత్తాత నాకు ఊహ తెలిసే వరకూ బ్రతికే వున్నారు. ఆయన తన తాత గురించి చాలా విషయాలు చెప్పేవారు. అంటే దాదాపు నాలుగైదు వందల ఏళ్ళ క్రితం సంగతి అది. మా ముత్తాతకి తాత చెప్పిన విషయం ఏమిటంటే మేము అసలు ఈ ద్వీపానికి సంబంధించిన వాళ్ళం కాదు. ఎప్పుడో ఏడెనిమిది వందల సంవత్సరాల క్రితం ఎక్కడో సింధూర ద్వీపం నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డామట."

సింధూర ద్వీపం పేరు వినపడగానే ఆశ్చర్యపోయాడు మహాబసు. ఆ ద్వీపం పేరు ఎక్కడో విన్నట్లు అనిపింపించింది అతనికి. కానీ ఎంత గుర్తు చేసుకున్నా గుర్తుకు రాలేదు. మాట్లాడకుండా సిరిగిరి చెప్తున్న విషయాన్నే వినసాగాడు.

"అసలు సంబంధం లేని విషయం చెప్తున్నానని అనుకోకు. ముఖ్యమైన విషయమే చెప్తున్నాను. ఏ దేశాన్నిపాలించే వాళ్ళకైనా రాజ్య కాంక్ష వుంటుంది. మరిన్ని రాజ్యాలు తమ ఏలుబడిలోకి రావాలని చుట్టుపక్కల వున్న రాజ్యాలను ఆక్రమించుకోవటం, యుద్ధాలు చెయ్యటం చాలా సహజమైన విషయమే కదా. అలాగే ప్రపంచంలో అనేక రాజ్యాలు విస్తరించాయి. కొన్ని రాజ్యాలు ఇలా కొత్త ప్రాంతాలను వెతుకుతూ సముద్రాలు దాటి కొత్త ద్వీపాలను కనుక్కున్నాయి. అలా సింధూర ద్వీపం కనుక్కున్న ద్వీపమే ఈ సవ్యలంక.

"ఇది చాలా వందల సంవత్సరాల క్రితం మాట. అప్పటికి సవ్యలంక ఇంతగా అభివృద్ధి చెందలేదు. చాలా వరకు ఆటవికులుగానే జీవిస్తుండేవాళ్ళు. అలాంటి ఈ ద్వీపం మీద ఓడల్లో అడుగుపెట్టారు సింధూర ద్వీప వాసులు. అయితే మిగిలిన దేశాలు ఇలా కనుక్కున్న కొత్త ప్రదేశాలను తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. అవి తమవే అని ప్రకటించుకున్నాయి. ఇంకొన్ని దేశాలు కొత్త ప్రదేశాల అభివృద్ధికి తోడ్పడ్డాయి. సింధూర దేశం చేసిందదే.

"ఒకసారి సవ్యలంకని కనుక్కున్న తరువాత సింధూర దేశం నుంచి రాజ్య కాంక్షతో సైనికులు రాలేదు. ఎంతోమంది శాస్త్రజ్ఞులు, వ్యాపారులు, కళాకారులు వచ్చారు. అలా వచ్చిన వ్యాపారస్తులలో మా తాత ముత్తాలు కూడా వున్నారు. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే – రాజ్య కాంక్షతో ఆక్రమణలు చేసిన రాజ్యాలు నిలబడలేదు. వ్యాపార సంబంధాలతో కలిసిన రాజ్యాలు నిలబడ్డాయి. ఫలితాన్ని సాధించాయి. ఇది చరిత్ర. ఇందులో అబద్ధమేదీ లేదు."

మహాబసు వెంటనే సమాధానం చెప్పాడు –

"ఒక్కటి తప్పు" అతని సమాధానం విని సిరిగిరి ఆశ్చర్యపోయాడు. ఏమిటన్నట్లు చూశాడు.

"వ్యాపారం కేవలం ముసుగు. అది ఆక్రమణకు దొడ్డిదారి. వ్యాపారం అంటేనే ఎన్నో వనరులను వాడుకునేందుకు అనుమతి కావాలి. ఆ వనరులను కొల్లగొట్టేందుకు అనుమతి పొందాలంటే ప్రభుత్వం అనుకూలంగా వుండాలి. అందుకోసం క్రమంగా వ్యాపారస్తులకు అనూకూలంగా వుండే వాళ్ళే ప్రభుత్వంగా మారతారు. ఆ విధంగా కూడా దురాక్రమణ తప్పదు."

"కొంత వరకు నిజమే కానీ వ్యాపారాభివృద్ధి కోసం ఏర్పాటయ్యే సదుపాయాలను మర్చిపోతున్నావు. సరేలే ఇది ఎటూ తెగని వాదన. వదిలేద్దాం. అసలు విషయానికి వద్దాం" అంటూ ఏదో చెప్పబోయాడు.

"వావ్! ఈస్ దట్ నాట్ వెరీ సిమిలర్ టూ ద ఈస్ట్ ఇండియా కంపెనీ స్టోరీ?" అరిచినంత పని చేశాడు డా. నరసింహం. ఈ కథంతా చెప్తున్న సారథి అప్పుడే ఆ విషయాన్ని గుర్తించినట్లు సాలోచనగా తలాడించాడు.

"అవును డాక్టర్. మీరు చెప్తుంటే నాకు కూడా అదే అనిపిస్తోంది" అన్నాడు.

"అంతే కాదు. ఆయన చెప్పిన విషయాలలో ప్రపంచ చరిత్ర మొత్తం వుంది. మన ప్రపంచ చరిత్ర."

"అవునా? నాకు అంత చరిత్ర ఐడియాలేదు" నవ్వాడు సారథి.

నేను చెప్తాను విను. చాలా వరకు మనుషులు భూమి మీద నడవగలిగినంత దూరం పరిశోధించి ఎక్కడ ఏమున్నాయో తెలుసుకొని వాటిని మాప్స్ రూపంలో కూడా పెట్టుకున్నాడు. భూభాగాలు అంతమైన తరువాత వచ్చే సముద్రాలు దాటితే అక్కడ ఏవో ద్వీపాలు వున్నాయని మాత్రమే మనిషికి తెలుసు. అందులో దేవతలు వుంటారనీ, మనుషుల్ని తినేసే రాక్షసులు వుంటారని, రాకాసి బల్లులు, డ్రాగెన్స్ వుంటాయని మాత్రం అనుకునేవాళ్ళు. ఆ కాలంలో వాళ్ళు తయారు చేసుకున్న మాప్స్ చూస్తే ఇలాంటివి అన్నీ కనిపిస్తాయి. దాదాపుగా మాప్ మొత్తం ఏదో ఒక ఎలిమెంట్ తో నిండిపోయి వుండేవి. తరువాత వచ్చిన మార్పు చాలా చిత్రమైనది. ఎలా జరిగిందో తెలియదు కానీ, మాప్ లో ఖాళీ జాగాలు వుంచడం మొదలుపెట్టారు. అక్కడ ఏముందో తమకి తెలియదు అని ఒప్పుకోవడం అన్నమాట. తెలియదు అని తెలియటం ముఖ్యం. ఆ తరువాతే తెలుసుకోవాలన్న తపన మొదలౌతుంది. అలాగే జరిగింది. అలా తెలుసుకునే ప్రయత్నంలోనే కొలంబస్ అమెరికా రావటం, వాస్కోడగామా మన దేశానికి రావటం, అలాగే ఆఫ్రికా ఆస్ట్రేలియా వంటి ప్రదేశాలను కనుక్కోవటం. ఇవన్నీ సాధ్యమయ్యాయి. సిరిగిరి చెప్పినట్లు వాళ్ళతో పాటు ప్రయాణించిన శాస్త్రవేత్తలు, వ్యాపారస్థులు, కళాకారులు ఆయా ప్రదేశాల అభివృద్ధికి దోహదపడ్డారు.

"ఇక్కడే ఇంకొక తిరకాసు వుంది. అప్పటికే ప్రపంచంలోనే సంపన్న దేశాలుగా, జ్ఞానభివృద్ధి బాగా జరిగిన దేశాలుగా వున్నా భారత్ చైనాలు మరో దేశానికి వెళ్ళే ప్రయత్నం చెయ్యలేదు. యూరోపియన్లు వేల కొద్దీ ఓడలతో ప్రపంచాన్ని అర్థం చేసుకుంటూ వుంటే మన వాళ్ళు అలాంటిదేమీ చెయ్యలేదు. చైనా యాత్రికుడు హుయాన్ స్యాంగ్ తప్ప ఇంకో పేరు వినపడదు. ఆయన యాత్రలను కూడా తరువాత చైనా ఆపేసింది. అదలా వుంచుదాం.

"మరో ముఖమైన సంఘటన ఏమిటంటే తరువాత జరిగిన పారిశ్రామిక మార్పులు. ఉదాహరణ చెప్పాలంటే రైలు మార్గం ఏర్పాటు కావటం. ఇంగ్లండ్ లో మొదలైన రైలు అనే ప్రయాణ రవాణా సాధనం నిదానంగా అన్ని దేశాలు పాకింది. యూరోపు అభివృద్ధి మొత్తానికి ఈ రైలు రవాణానే కారణం అని చెప్పచ్చు. కానీ రైలు వ్యవస్థ ఇంగ్లండ్ లో మొదలైన దాదాపు వంద సంవత్సరాల దాకా చైనాలో సరైన రైలు రవాణా వ్యవస్త ఏర్పాటు కాలేదు. అందుకే తరువాత జరిగిన పారిశ్రామిక విప్లవంలో యూరోప్ అభివృద్ధి చెందినంత త్వరగా చైనా అభివృద్ధి చెందలేదు."

ఆవేశంగా చెప్తున్న డా నరసింహం వైపు ఆశ్చర్యంగా చూశాడు సారథి.

"మీరు డాక్టర్ గా వుండి ఇవన్నీ ఎలా తెలుసుకున్నారు?" అడిగాడు.

"ఇంటరస్ట్. హిస్టరీ కెన్ రిజాల్వ్ మెనీ మిస్టరీ అని నా అభిప్రాయం." నవ్వాడతను.

"అది సరే. ఈ చరిత్రలో ఇండియా గురించి చెప్పలేదు మీరు. ఈస్టిండియా కంపెనీ వచ్చి భారత దేశాన్ని కొల్లగొట్టిన సంగతి.."

"కాదు కాదు. కొల్లగొట్టిందని నేను ఒప్పుకోని. బ్రిటీష్ రావటం వల్ల మనకి చాలా మంచే జరిగింది. రాజ్యాలను ఆక్రమించే క్రమంలో సాధారణంగా కొత్త ప్రాంతం తాలూకు సాంస్కృతిక సంపదని నాశనం చెయ్యడం జరుగుతుండేది. మనపైన ముస్లిం రాజ్యాల దండయాత్రల సంగతి వినే వుంటావు. బ్రిటీష్ వచ్చి మన సంస్కృతిని నాశనం చేసింది అని చెప్పలేము. ఇన్ ఫాక్ట్ ఇలా వ్యాపార ప్రధానంగా ఆక్రమణ జరిగినప్పుడు అక్కడి సంస్కృతి తెలుసుకునేందుకు, ఆ సంస్కృతిని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నం చేశారు. మన బ్రౌన్ దొర నిఘంటువు – అదే డిక్షనరీ– తయారు చెయ్యడం లాగా అన్న మాట..." ఆయన చెప్తున్న విషయం విన్న సారథి క్రమంగా లేచి కిటికీ వద్దకు నడిచి బయటికి చూడటం మొదలుపెట్టాడు.

"ఏమైంది మహాబసూ?" అన్నాడు డాక్టర్.

"మనం ఇంతకు ముందు కూడా అనుకున్నాం గుర్తుందా? సవ్యలంకలో అందరూ ఎడమ చేతిని వాడటం స్వాభావికం కాదు అని. అది నిజమే అని ప్రూవ్ అవుతోంది. అంతమంది సామాన్య జనం మమ్మల్ని నమ్మి పోరాటాన్ని బలపరుస్తున్నారంటే కారణం అదే అయ్యివుంటుంది. మరి స్వతహాగా కుడిచేతి వాటం వున్న మనుషుల్ని ఎడమ చేతికి మార్చే ప్రక్రియ ఎప్పుడు మొదలైంది. ఎందుకు మొదలైంది. ఇది తెలుసుకోవాలంటే ఆ వ్యాపార సంస్థలు సవ్యలంకలోకి వచ్చినప్పుడు అక్కడి సంస్కృతిని అధ్యయనం చేసి వుంటారు కదా? అలాంటి అన్వేషకుడి అధ్యయనం కావాలి. అది సంపాదిస్తే ఈ మిస్టరీ విడిపోతుంది"

"యు ఆర్ కరెక్ట్ మహాబసు" డాక్టర్ కూడా ఉత్సాహంగా నిలబడ్డాడు.

"కానీ, ఈ విషయం మహాబసుకి తెలిసెదెట్లా?" అని సారథి డా. నరసింహం వైపు చూశాడు.

వర్తకులు, వ్యాపారస్థులు సమావేశానికి మహాబసుని పిలిచారన్న సమాచారం వచ్చిన వెంటనే ఉగ్ర సుధాముణ్ణి దక్షిణావతానికి పంపించాడు. సుధాముడు అక్కడ సమావేశానికి జరుగుతున్న ఏర్పాట్ల నుంచి, వర్తకులలో ఆ సమావేశం గురించి జరుగుతున్న సంభాషణల వరకు అన్నీ పరిశీలించాడు. మారువేషంలో సంచరిస్తూ ఎక్కడైనా ఉద్యమానికి వ్యతిరేకంగా ఏదైనా జరిగే అవకాశముందా అని పరిశీలించాడు. ముఖ్యంగా మహాబసుకి వామదేవుడి వల్ల ప్రాణహాని వుందేమోనని అణువణువూ గాలించాడు. ఎక్కడా అనుమానాస్పదంగా లేకపోవటంతో అదే విషయాన్ని ఉగ్రకి చేరవేశాడు సుధాముడు.

"ఎక్కడా ఎలాంటి ప్రమాదానికి ఆనవాలూ లేదు కానీ సిరిగిరి కొడుకులు ఇద్దరూ మన పోరాటానికి వ్యతిరేకంగా వున్నారు. వాళ్ళిద్దరూ కలిసి మహాబసుకి వ్యతిరేకంగా ఏదైనా చేస్తారన్న భయం లేదు. ఎందుకంటే అది వాళ్ళ తండ్రి అంగీకరించడు. కారణం – సిరిగిరి మహాబసు భక్తుడు. ఆయనే ఈ సభకి అధ్యక్షుడిగా వుంటున్నాడు. కాబట్టి మహాబసుకి వ్యతిరేకంగా ఏదీ జరగనివ్వడు" అన్నది ఆ వర్తమానం సారాంశం.

ఉగ్ర ఆ వర్తమానాన్ని జాగ్రత్తగా చదివాడు. సమావేశ మందిరానికి ఒకటే ద్వారం వుండటం, సిరిగిరి కొడుకులు ఇద్దరూ అనుమానాస్పదంగా అనిపించడం – ఈ రెండు కారణాలు మహాబసు క్షేమంగా వుంటాడన్న నమ్మకాన్ని ఇవ్వలేకపోయాయి. వెంటనే మరో ఇద్దరు అనుచరులని తీసుకోని దక్షిణావతం చేరుకున్నాడు. సుధాముడితో కలిసి రహస్యంగా ఆ సమావేశ మందిరాన్ని గమనిస్తూ ఉండిపోయాడు.

అంతకు ముందే సమావేశ మందిరం నుంచి అందరూ బయటికి రావటం చూశారు. వాళ్ళలో మహాబసు లేకపోవటం గమనించి సుధాముడు ఆవేశంగా ముందుకు కదలబోయాడు. ఉగ్ర అతన్ని వారించాడు

"సిరిగిరి ఇంతవరకు బయటకు రాలేదు. బహుశా ఆయనతో మహాబసు సమావేశం నడుస్తుండవచ్చు. మహాబసుతో ఆయన వున్నంత వరకు ఎలాంటి ప్రమాదమూ వుండదు" అని చెప్పాడు.

కానీ అందరితో పాటు వచ్చిన సిరిగిరి కొడుకులు సిరిచరం, సిరివరం ఏదో మంతనాలు ఆడుకోవడం. అందరూ వెళ్ళిన దిశగా కాకుండా మరో వైపు వెళ్ళడం ఉగ్ర గమనించాడు. అతని మనసు కీడు శంకించింది. వెంటనే తనతో వచ్చిన అనుచరులిద్దరినీ వాళ్ళని వెంబడించమని పంపించాడు.

ఇదంతా జరిగి కూడా కొంత సమయం గడిచింది. అటు సిరిచరం, సిరివరం వెంట వెళ్ళిన వాళ్ళు తిరిగిరాలేదు. ఇటు లోపల వున్న మహాబసు బయటికి రాలేదు.

"ఏం చేద్దాం?" అన్నాడు సుధాముడు ఆందోళనగా.

"ఎదురు చూడటం తప్ప ఇంకేం చెయ్యగలం." అంటూ నిట్టూర్చాడు ఉగ్ర.

మరుక్షణం అతని ముఖం ముందు నుంచి దూసుకెళ్ళిందో బాణం. అలా వెళ్ళిన బాణం వాళ్ళు అప్పటిదాకా కనపడకుండా దాక్కున్న చెట్టు మానుకు గుచ్చుకోని ఆగిపోయింది. సుధాముడు వెంటనే బాణం వచ్చిన దిశ వైపు చూశాడు. ఉగ్ర మాత్రం బాణం వైపు చూశాడు. బాణం ఎంత వేగంగా వచ్చినా, ఆ బాణానికి ఏదో తగిలించబడి వున్నదన్న విషయం అతని నిశిత దృష్టిని దాటిపోలేదు. అతని అంచనా నిజమైంది.

బాణానికి ఒక కవచం తాలూకు ముక్క తగిలించి వుంది. ఎవరో సైనికుడు గుండె మీద వున్న కవచంలో ముక్క అది. పరిశీలించి చూస్తే ఆ ముక్క మీద మహాబసు సైన్యం ముద్ర కనపడింది. అది ఉగ్రతో కలిసి వచ్చిన ఇద్దరు సైనికులలో ఒకరిది. జరిగిందేమిటో క్షణంలో అర్థం చేసుకున్న ఉగ్ర సుధాముణ్ణి హెచ్చరించబోయాడు.

సుధాముడు బాణం వచ్చిన దిశగా చూసి ఆశ్చర్యపోయాడు. దళాధిపతి తన సైన్యంతో ఇటు వైపే వస్తున్నాడు. అతనికి రెండు వైపులా వున్నారు సిరిచరం, సిరివరం. అవన్నీ కాదు అతన్ని భయపెట్టింది. దళాధిపతి ఎక్కుపెట్టిన బాణం. క్షణంలో వందో వంతు, సుధాముడు కానీ ఉగ్ర కానీ గుర్తించే లోగా బాణాన్ని విడిచిపెట్టాడతను.

సుధాముడు తప్పుకున్నాడు. ఉగ్ర కూడా తప్పుకోవాలనుకున్నాడు. కానీ అప్పటికే ఆలస్యమైంది. దళాధిపతి వదిలిన బాణం ఉగ్ర ఎడమ భుజాన్ని చీల్చుకుంటూ వెళ్ళి వెనక వున్న చెట్టులో దిగబడింది.

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS